# మసక యిరులు

"ఇదిగోనమ్మా పిన్నీ, యివి కొనుక్కొచ్చాం నిన్న వెళ్ళి" అని కామేశ్వరి మూడు కాగితం పొట్లాలు పట్టుకొచ్చి సీతారావమ్మ ముందు పడేసింది. సీతారావమ్మ ఒక్కో పేకట్టే విప్పి, చీరెలు, జాకెట్టు బట్టలు బయటకు తీసింది.

"ఇదిగో, యీ నారింజరంగు పట్టు చీరె కంచిది నాకు. నూటయాభై ఎనిమిది. నూట అరవై ఆరు చెప్పాడు. క్రిందా, మీదా పెట్టి అరగంట బేరమాడితే చివరికి ఆ ఎనిమిది రూపాయలూ తగ్గించాడు" అన్నది కామేశ్వరి.

సీతారామమ్మ కళ్ళతో మెచ్చుకుంటూ "బాగుంది. పండులా వుంది" అన్నది.

కామేశ్వరి నవ్వింది. "అదేమిటోగానీ, నాకు యీ రంగు ఎన్ని సార్లు కట్టినా, దాని మీద మనస్సుపోదు. ఎన్ని చీరెలు తీసి చూపించనీ, యిది కనబడగానే ఠక్కున నచ్చుతుంది. ఆయనకి విసుగు ఎప్పుడూ యీ కాషాయ రంగేమిటని" అన్నది.

కొంచెం ఆగి, "మరి.. ఎర్ర నైలాను చీరె ఎనభై నాలుగు, మా చిట్టికి. ఇదుగో దాని కంటె రెండున్నర ఎక్కువ నీలంది మా శకుంతలకి. బాగున్నాయి కాదూ? నన్ను యిల్లాంటిదే యింకొకటి తీసుకోమని మీ అబ్బాయి అనడం – చిన్న పిల్లలు వాళ్ళు కట్టుకుంటే బాగుంటాయి కానీ, నాకేమిటమ్మా చెంపలు నెరిసి?" అన్నది కామేశ్వరి.

సీతారామమ్మ నిజమేనన్నట్లు తలూపింది. "ఏమో ఆయనకి ముచ్చట కాబోసు. ఈ నీలంది మరీ బాగుంది. ఎల్లాగైనా భలే సెలక్షనే నీది" అని ఆవిడ మెచ్చుకోగానే, కామేశ్వరి ముసిముసిగా నవ్వుకుంది.

"శకుంతలా! యివి పట్టుకెళ్లి లోపల పెట్టమ్మా! దుమ్ముపడి పాడౌతాయి" అని కామేశ్వరి కేకేసింది. శకుంతల వచ్చి, చీరెలు కాగితం సంచులలో పెట్టేసి పట్టుకెళ్లింది.

సీతారామమ్మ ఆ అమ్మాయి వెళ్ళిన గుమ్మం కేసి చూస్తూ "కామేశ్వరీ! నిన్ను మాత్రం చెప్పుకోవాలమ్మా! కూతుర్ని, కోడల్ని ఒక్క మాదిరిగా చూచుకోవడం విషయంలో. మనవాళ్ళంతా అదే అనుకుంటారు. 'ఎప్పుడో ఓమాటు ఆ తేడా కనిపించకపోదు కదా కామేశ్వరికి. నిజంగా ఎంత ఆపేక్ష, ఒక్క పొల్లు పోనివ్వదు పెట్టుపోతలలో!' అని" అన్నది.

కామేశ్వరి తల వంచుకుంది. కళ్లల్లో క్షణం సేపు గర్వం మెరిసి మాయమైంది. "ఏమోనమ్మా పిన్నీ! నాకు ఎప్పుడూ అనిపించదు యిది కోడలని, అది కూతురనీ. ఇద్దరూ మన పిల్లలే. ఆ మాటకొస్తే శకుంతల

పాపం. పుట్టి పెరిగినదాది ఒక్కనాడు శుభ్రమైన బట్ట కట్టుకుని ఎరుగదు. మనింటికొచ్చాకే దాని మనసులన్నీ తీరేది. అందుకనే నాకు మరీ ప్రాణం విలవిలలాడుతుంది దానికేమన్నా లోటు చేస్తే... సరే. యీ సోదంతా దేనికిగానీ, కూర్చో. కాఫీ పట్టుకొస్తా" అని లేచింది కామేశ్వరి.

సీతారామమ్మ కూర్చోలేదు. లేచింది. "అమ్మో! ఈ వేళప్పుడు కాఫీ తాగితే యింక రోజంతా ఆకలి చచ్చిపోతుంది నాకు" అన్నది, అంటూనే కామేశ్వరి వెంట వంటింటివేపు వెళ్ళింది.

శకుంతల వంటింట్లో కూర్చుని అరటికాయలు తరిగి ముక్కలు నీళ్ళ గిన్నెలో పడేసింది.

"ఏం పిల్లా, మడి కట్టుకోలేదా యింత పొద్దెక్కినా?" అన్నది సీతారామమ్మ.

శకుంతల నవ్వింది. "లేదండీ. అత్తయ్యే చేస్తారు ప్రొద్దున్న పూట" అన్నది.

"వాడివ్వాళ్ళ ఆఫీసుకి భోంచేయకుండా వెడుతున్నాడు పిన్నీ. ఎక్కడో పార్టీవుందిట. కాఫీ తాగకపోతే పోయావు గానీ, యిది నోట్లో వేసుకో" అని ఒక చిన్న లడ్డూ ఉండ తెచ్చి సీతారామమ్మ చేతిలో పెట్టింది కామేశ్వరి.

"మొన్న – ఏమన్నా చేసుకుందామండీ అత్తయ్యా అంటూ మొదలెట్టింది కోడలు పిల్ల. సరేనని ఒక అర్ధసేరు పిండి బూంది దూశాను" అన్నది కామేశ్వరి శకుంతల వేపు చూసి.

సీతారామమ్మ లడ్డూ చిదిపి, ముక్క నోట్లో వేసుకుని చప్పరించింది. చిరునవ్వుతో శకుంతల వేపు చూచి, "ఏం మనవరాలా! జిహ్వ అవీ యివీ కావాలంటోందా ఏం విశేషం?" అన్నది.

శకుంతల తలెత్తలేదు. మరింత వంచి మరో అరటికాయ తీసి, చెక్కు తీస్తోంది కామేశ్వరి పగలబడి నవ్వింది. "ఏమోనమ్మా యీ ఆరేళ్ళనుంచీ లేనిదీ, నీ నోటి వాక్యాన నిజమై వూరుకుంటుందేమో!" అన్నది.

సీతారామమ్మ నవ్వుతూ వెనక్కి తిరిగింది. ఆమెగానీ, ఆమెని సాగనంపడానికి వెంట వెళ్ళిన కామేశ్వరిగానీ శకుంతల చెవుల దగ్గర్నించి, మెడ క్రిందవరకూ ఎర్రగా కందిపోవడం చూడనేలేదు.

– గదిలో మంచంమీద దోమతెర పైకి పడేసి, రగ్గు మడత పెట్టి, దుప్పటి దులిపి పక్క సరిజేసింది శకుంతల. కుర్చీమీద ఆయన పడేసిన తడి తువ్వాలు తీసుకెళ్ళి బయట ఆరేసి వచ్చింది. డ్రెస్సింగు టేబిలు ముందు కూర్చుని జడ విప్పుకుందామని ముందుకు వేసుకుంది. రిబ్బను వూడతీసుకుంటూ, అద్దంలో చూసుకుంది. తనది వత్తైన జుట్టు... మంచి తలకట్టని పుట్టింట్లో వుండగా అందరూ అనేవారు. తను కాపురానికి వచ్చినప్పటినుంచీ అత్తగారు, "చేతినిండా వస్తాయి పాయలు ఎంచక్కా" అని ముచ్చట పడి జడ వేస్తుండేది. మల్లె పూల రోజుల్లో వంకీ జడ, పెద్ద జడ, మొగలి పూల రోజుల్లో పెట్టెజడ, చక్రాల జడ వేసేది. దాగురేకులు, కనకాంబరాలు, దవనం మధ్య మధ్యలో కుడుతూ.

తనకి నడుం నెప్పి, విసుగూ అంతసేపు కూర్చుని వేయించుకోవడమంటే, హైస్కూలుకి వచ్చాక అసలు పూలజడే వేయించుకోవడం మానేసింది తను. ఎప్పుడన్నా ఒకటీ, అరా గులాబీ పూలు పెట్టుకునేది. పూలు పెట్టుకుంటే రాత్రంతా నిద్రపట్టేది కాదు తల బరువుగా వుండి.

ఫిఫ్తుఫారం ఫెయిలు కావడం, తన పెళ్ళి ఐపోవడం, తను కాపురానికి వచ్చేయడం – అన్నీ వ్యవధిలేకుండా జరిగిపోయాయి. ఆరేళ్లైంది యిప్పటికి.

ఆయన పొద్దున్న ఆఫీసుకి వెడితే సాయంత్రం ఆరున్నర, ఏడు ఔతుంది వచ్చేసరికి. అప్పటి వరకూ చదివిన పత్రికలే చదవడం. రేడియోలో విన్న పాటలే వినడం, మత్తుగా కళ్ళు మూసుకుని పడుకోవడం, ఏమీ తోచకపోతే వంటింట్లో డబ్బాల్లో వున్న చేగోడీలు, జంతికలు తినడం.

జడవిప్పి నూనె రాచుకుని, చిక్కుతీసుకుంటుంటే కామేశ్వరి వచ్చింది. "చప్పున దువ్వుకుని, స్నానం చేసి ఆ జరీ చీరె కట్టుకురా. మీ పెదమామగారి కూతురు, అల్లుడు వచ్చారు." అన్నది హడావిడిగా.

శకుంతల పావుగంటలో తయారైంది. తడిసిన ముంగురులు కొంగుతో అద్దుకుని, ముఖాన కుంకం పెట్టుకుంది. పమిట సవరించుకుని ముందు గది గుమ్మం దగ్గరికి వెళ్ళింది. పమిట కప్పుకుంటుంటే చేతి గాజులు గలగలలాడాయి.

"అదుగో! మా కోడలు వచ్చింది. రావే శకుంతలా! మనవాళ్ళే" అన్నది అత్తగారు. ఆవిడ ప్రక్కన సోఫాలో ఆ అమ్మాయి కూర్చునుంది. తన వయస్సే వుంటుంది. అత్తగారి వళ్ళో చంటి పాపాయి వుంది. ఇవతల సోఫాలో మామగారు ప్రక్కన ఆయన కూర్చునున్నారు.

ఆ అమ్మాయి లక్ష్మి. చొరవగా శకుంతల చేయి పట్టుకుని ప్రక్కన కూర్చోబెట్టుకుంది.

"అమ్మో పిన్నీ! మా వదినకి ఎంత సిగ్గమ్మా! ఆరేళ్ళ క్రితం పెళ్లినాడు ఎల్లా వుందో, అంత సిగ్గుల పెళ్ళికూతురున్నూ యిప్పుడు. మా అన్నయ్య వంకన్నా చూస్తుందా?" అన్నది లక్ష్మి నవ్వుతూ.

అత్తగారు తన వంక ఆపేక్షగా చూస్తోంటే సిగ్గుపడి నవ్వింది శకుంతల. "మీరు భలే వారండీ! తమాషాగా అంటారు మరీన్నూ" అన్నది లక్ష్మిని చూసి.

ఆ తర్వాత వాళ్ళు అవీ యివీ మాట్లాడుతుంటే విన్నది శకుంతల. వాళ్ళు లేచారు వెడతామని. లోపలికి వెళ్ళి తాంబూలం పళ్లు తెచ్చి, బొట్టు పెట్టి యిచ్చింది శకుంతల. లక్ష్మి ఆమె వేపు చూసి, "మాతో రారాదూ నువ్వూ? దగ్గరే మధ్యాహ్నం కాఫీ త్రాగి వచ్చేద్దువు గాని" అన్నది. శకుంతల అత్తగారి వేపు చూసింది. ఆవిడ తన చేతుల్లోని పాపాయిని లక్ష్మికిస్తూ, కోడలి వంక సాలోచనగా చూసింది.

అత్తా కోడళ్ళనిద్దరినీ చూసిన లక్ష్మి, "మధ్యాహ్నానికి పంపించేస్తా పిన్నీ! ఆయన భోంచేసి వెళ్లిపోతారు. నేను, తను కబుర్లు చెప్పుకుంటాం. ఏం?" అన్నది కామేశ్వరితో.

ఆవిడ వెంటనే ఏమీ అనలేదు. కొంచెం ఆగి, "ఎందుకులే మరో మాటు వస్తుంది. నేను ఒక్కత్తెనే వుంటా రోజంతా, తోడుగా వుంటుంది" అన్నది.

మరి కాస్సేపటికి వాళ్ళు వెళ్లిపోయారు.

తన గదిలోకి వెళ్లి అద్దం ముందు నిలబడి మెరిసే కొత్త జరీ చీరె, అప్పుడే పెట్టుకున్న కుంకుంలోని తళుకు, నుదుటి మీద తేలిగ్గా వూగే చిన్న వెంట్రుకలు చూసుకున్నది శకుంతల. ఆమె కళ్ళల్లో, నల్లని కనుపాపల్లో నిద్రపోతున్న ఆ పాపాయి పనస తొనల్లాంటి చేతులు క్షణం సేపు కనుపించాయి.

సాయంత్రం వరకు పరుచుకుని వున్న ఆ మధ్యాహ్నంలో పాపాయి కేరింతలు. వదిన వరుసతో లక్ష్మి తనతో ఆడే వేళాకోళాలు, వాళ్ల యిల్లు, ఆ యింట్లో ఎండలో తనకి కనుపించే కొత్తదనం.. అన్నింటి కోసం ఆమె మనస్సు చేతులు జాస్తోంది. గడియారం ముళ్ళు బద్ధకంగా జరుగుతోంటే, సుదీర్ఘంగా వున్న ఆ మధ్యాహ్నం అన్ని మధ్యాహ్నాల్లాగే గడిచింది ఆమెకి.

– ఆరున్నరైంది. వాసు యింటికి వచ్చేసరికి. ఐదు కాగానే గోరు వెచ్చని నీళ్ళతో స్నానం చేసి, ఎర్రంచు తెల్ల జరీ చీరె కట్టుకుంది శకుంతల. అత్తగారు మధ్యాహ్నం పూలు కొన్నది. వంకీ జడ వేస్తానన్నది ఆవిడ. 'వద్దండీ. పెద్ద దండ గ్రుచ్చి పెట్టుకుంటాను' అన్నది తను. ఆవిడ రెండు మూడుసార్లు మళ్ళీ అన్నది కానీ... చివరికి ఏమనుకున్నదో కానీ మళ్ళా ఎత్తలేదు. నాల్గుగంటలకి కాఫీ యిచ్చినప్పుడు "నీకు పెద్ద జడ వేస్తానన్నా కానీ, నాకు నడుం పీక్కుపోతోందివాళ. వేయలేను. సీతారామమ్మ వేస్తుందేమో అడుగు" అన్నది కొంచెం ఆగి, "ఆవిడ కిల్లాంటి సున్నితపనులు చేతగావులే – పోనీలే, పెట్టేసుకో పూలు యివ్వాళకి" అన్నది.

వాసు వచ్చి ఆమెని పలకరించాడు. వీధిలోకి వెళ్లొచ్చిన తన మురికి బట్టలు చూసుకుని నవ్వి, "నీ తెల్ల చీర పాడు చేయను" అంటూ ముఖం కడుక్కోవడానికి లోపలికి వెళ్ళిపోయాడు భార్యను దగ్గరకు తీసుకోకుండా. ఏవో కబుర్లు చెబుతూ అతను టిఫిను తింటుంటే, ప్రక్కన కూర్చుని 'వూ' కొడుతూ విన్నది

శకుంతల. "అన్నట్టు.. నీ కోసం వార పత్రికలు పట్టుకొచ్చాను. క్రొత్త నవలలు వచ్చాయి లైబ్రెరీలోకి. రెండు తెచ్చాను చదువు. ఎల్లుండి యిద్దాం" అన్నాడతను.

"అబ్బాయ్!" అని మామగారు కేకేశారు. మధ్యాహ్నం వి.పి.పి.లో ఏవో పుస్తకాలు వచ్చాయి ఆయన ఆర్డరిచ్చినవి అవి చూపించడానికి కాబోలు. ఎనిమిదిన్నరకి భోజనానికి వచ్చేవరకూ అతను కనిపించలేదు శకుంతలకి.

కామేశ్వరి తన ఫలహారం తనే చేసుకుంటుంది. కోడలు కుంపటి అంటించి యిస్తే మగవాళ్ళిద్దరికీ వడ్డించేసింది శకుంతల. వాళ్ళ భోజనం అయ్యేసరికి తొమ్మిదైంది. తను భోజనానికి కూర్చుంది. అన్నం సయించడం లేదు అసలు.

కామేశ్వరి వక్క పలుకు వేసుకొని వచ్చి ఆమె ప్రక్కన కూర్చుంది. "ఏమిటే ఆ తినడం? నీ యిల్లు బంగారంగానూ, నేను దగ్గర లేననా – నా వల్లకాదది" అంటూ మీగడ పెరుగు గుమ్మరించి, మామిడి పండు కంచంలో పడేసింది ఆవిడ.

శకుంతలకి అవి తినేసరికి ఎకసక్కెమైంది. కామేశ్వరి కోడలి వంక చూస్తూనే వుంది. సీతారామమ్మ చెప్పిన మాట మనస్సులో మెదిలింది.

శకుంతల భోజనం చేసి గదిలోకి వెళ్లేసరికి వాసు షర్టు తొడుక్కుంటున్నాడు. "అమ్మకి చెప్పిరా. సినిమాకెడదాం!" అన్నాడు.

శకుంతల నవ్వింది. "నిజంగానా?" అన్నది. హడావిడిగా లోపలికెళ్ళి అన్నీ సర్దేసి, అత్తగారి దగ్గర కెళ్ళింది. "ఏమండీ!" అని తను అనేలోపే, వాసు వచ్చాడు అక్కడికి. "అమ్మా! మేము సినిమాకెడతామమ్మా!" అన్నాడు.

కామేశ్వరి తలెత్తి చూసింది. ఒక్క క్షణం కోడలి వంక చూసి ఆమె మళ్ళీ తలదించుకుంది. "నువ్వెళ్లు దాన్ని తీసుకెళ్ళద్దు" అన్నది మెల్లిగా.

వాసు తెల్లబోయాడు. "ఏం?" అన్నాడు. కామేశ్వరి తలెత్తి మళ్ళీ కోడలి వంక చూసి నవ్వింది. "మాట! ఇల్లారా!" అన్నది. వళ్లంతా నీరసంగా ఐపోతోంది శకుంతలకి. ఇందాక గంతులు వేసిన మనస్సు వున్న చోటే బరువెక్కి పోతూ క్రుంగదీస్తోంది. నీరసమైన కాళ్ళతో ఆవిడ దగ్గరెళ్ళింది. "నువ్వు రాత్రి పొద్దుపోయేవరకు మేలుకోకూడదు. తెలిసిందా? ఉత్త వెర్రి పిల్లవి. నా దగ్గర ఏం దాస్తావు?" అంటూ అత్తగారు రహస్యంగా తన చెవి దగ్గర అన్నది.

అబద్ధం... అంతా అబద్ధం అని శకుంతల మనస్సు బ్రహ్మాండమైన కేకలు వేసింది.

– ఆ రాత్రి ఆయన సినిమాకు వెళ్లారు తను మరీ మరీ బలవంత పెడితే. గదిలో మంచం మీదకు పడుతున్న వెన్నెల్లో శకుంతల పడుకుంది. తనకి వంట్లో బాగుండకపోతే ఏం? ఆయన చూసుకోలేరు ఆ మాత్రం? చిట్టి కడుపుతోంటే తొమ్మిదో నెలలో కూడా సినిమాకి వెళ్ళలేదూ! గణగణలాడే రిక్షా, సన్నని చప్పుడు చేస్తూ రోడ్డు మీద పరుగెత్తే టాక్సీ. రాత్రి వెలుగంతా తమదే అయినట్లు వెర్రిగా వెలిగే సినిమా హాలు లైట్లు, సినిమాలో ఆయన ప్రక్కన కూర్చుని లోకంతో ఏమీ సంబంధం లేకుండా సినిమా దృశ్యాలలో ఏకమై పోతుండే తను – అవన్నీ ఎప్పుడు? అర్ధరాత్రి యింటికి వచ్చి, తామిద్దరే, తామిద్దరే వున్న ఆ చిరు చీకటి కోసం, చల్లని రాత్రి కోసం, ఏమీ వినిపించని వెన్నెలలో తడిసిన రాత్రికోసం – ఆమె మనస్సు బాధగా చేతులు జాస్తోంది.

బయట తలుపు చప్పుడైంది. "అమ్మా!" అని మెల్లిగా పిలుస్తున్నారాయన. శకుంతల చటుక్కున లేచి వెళ్ళి తలుపు తీసింది. అతను తెల్లబోయాడు. "ఇంకా మేలుకున్నావా నువ్వు?" అన్నాడు. మెల్లిగా గడియవేసి లోపలికి వచ్చి, బట్టలు మార్చుకున్నాడతను. ఆమె గదిలో లైటు వేసి, కుర్చీలో కూర్చుంది. "కళ్ళలా ఎర్రబడ్డాయేం?" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. దగ్గరకు వచ్చి, "ఎల్లా వుంది వంట్లో?" అన్నాడు సన్నగా నవ్వి. బుగ్గల మీద తన చేతులుంచి నవ్వాడు. "నిజమా అమ్మ చెప్పింది?" అన్నాడు. శకుంతల ఔనని తలూపింది. కసిగా వున్న ఆమె మనస్సులో ఆ సంబరం ఏదీ? బాధకు నిద్ర పట్టక ఎర్రగా ఐపోయిన ఆమె కళ్ళలో ఆ సిగ్గు తెరలేవీ?

"పడుకో. ఇంత సేపు మేలుకోవద్దని చెప్పలేదూ? బొత్తిగా తెలియకపోతే ఎలా శకూ?" అన్నాడతను లాలనగా.

–మేలుకోవద్దని చెప్పారు – నిజమే. పట్టు చీరలు కట్టుకోమని చెప్పారు. క్షణానికో కొత్త చీర కట్టుకోమని యిచ్చారు. ఇష్టమైన నగలన్నీ చేయించారు. సంవత్సరానికి రెండు నెలలు పుట్టింటికి పంపించారు. వద్దన్న కొద్దీ జీడి పప్పులు, సీమబాదం పాలు, ఎండు ద్రాక్షాయలు, బర్ఫీలు, – అన్నీ పెడతారు.

శకుంతలకి కంఠంలోకి ఏదో బాధ వస్తోంది. తనకి ఎకసక్కెంగా వున్న ఆ ఆపేక్ష, పట్టు త్రాళ్లు. బంగారు గొలుసులతో తనని బంధించే యీ ప్రేమ యీ జన్మకి వదలవు.

మిట్టమధ్యాహ్నం ఎండలో బస్సు కోసం నిలబడి వచ్చిన బస్సు ఎక్కి, తోచిన చోట దిగి, కావలసినవన్నీ కొనుక్కుని తిరిగి తిరిగి రావాలి – సాయంత్రం నీరెండలో కాలి నడకన సముద్రం ఒడ్డున, తారు రోడ్డుమీద, జనం గుంపులుగా వుండే హోటళ్ళలోనూ ఆయనతో తిరగాలి. తను ఎన్నిక చేసే హక్కులేని నూరు రూపాయల పట్టు చీరెలు, తను వెళ్ళడానికి వీలులేని ఆ పట్టుచీరెలు దొరికే పెద్ద దుకాణాలు, అత్తగారు, మామగారు ఎన్నికచేసి, తన బాగు చూసి, తన యిష్టం వూహించి పట్టుకొచ్చే ఆ చీరెలు, ఆ నగలు – ఏమీ వద్దు తనకి. చిన్న దుకాణాల్లోకి మిట్టమధ్యాహ్నం వేళ, దీప దీపాల వేళ వెళ్లి, తన పర్సు లోంచి చిన్న నోట్లు తీసి వాయిలు చీరె కొనుక్కోవాలి.

సుడిగాలిలో, హోరున వీచే గాలిలో, ఏ చెట్టు జాడ కనుపించని ఖాళీ బయలులో, వెచ్చగా తాకే సూర్యుని కాంతిలో, చుర్రుమనిపించే తీక్షణమైన ఎండలో భోరున కురిసే వానలో, చిటపటమని కురిసే సన్నని చినుకుల్లో, రాళ్లలాగా విసురుగా చినుకులు తగిలే పెద్ద జడివానలో – అన్నిటిలో రెక్కలు విదిలించి, రెక్కలు తపతపలాడిస్తూ, అలిసిపోయిన రెక్కలతో, శ్రమతో ఎగిరే పక్షి జన్మ ఎంత బాగుంటుంది?

– ఇంత కోరిక మనస్సులో వున్నదని, యింత బాధ తనలో యిముడ్చుకుంటున్నాని తెలియని శకుంతల దిగులుగా కిటికీలోంచి బయట ఆకాశంలోకి చూస్తూ పడుకుంది. మనస్సులో పొరలు పొరలుగా వున్న మమతల్లో, అనురాగాల్లో, కోరికల్లో, చీకాకుల్లో, ఆగ్రహాల్లో, ఆశల్లో – అన్నిటిలోనూ కలిసిపోయి దాగి వున్న ఆ అసంతృప్తి ఏమిటో తెలియక, ఆమె మనస్సు శూన్యంలోకి చేతులు జాస్తోంది.

❋